

ప్రభుత్వాస్పత్రిలో రాత్రిళ్లు పోలీస్ సెక్యూరిటీ అవసరం

ప్రభుత్వాస్పత్రిలో రాత్రిళ్లు పోలీస్ సెక్యూరిటీ అవసరం. ఆసుపత్రిలో ఎవరైనా గొడవలు చేస్తే వెంటనే పోలీసులు స్పందించాలి. ప్రధానంగా మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి. నైట్ డ్యూటీ ఉన్న వైద్యులకు సెక్యూరిటీగా పోలీసులను కేటాయించాలి.

– డాక్టర్ అనిలా, అనస్తీషియా వైద్యురాలు, ధర్మవరం ప్రభుత్వాస్పత్రి





వైద్యులకు రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన ఘటనను తలచుకుంటేనే భయమేస్తోంది. రాత్రిపూట విధులను నిర్వహించే వైద్యులకు రక్షణ కల్పించాలి. ఆసుపత్రుల పరిసర ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఆసుపత్రిలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి వైద్యులకు భరోసా ఇవ్వాలి. వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించాలి.

– డాక్టర్ లక్ష్మి, మలకవేమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పండ్లతోట.. లాభాల మూట!

- మండలంలో 223 ఎకరాల్లో తోటల పెంపకానికి ప్రణాళికలు
- డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద రైతులకు కేంద్ర ప్రభుత్వం చేయూత
- ఇప్పటి వరకూ 107 ఎకరాల్లో పూర్తి చేసిన అధికారులు

నల్లచెరువు: కేంద్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులు నిత్యం ఆదాయం చేకూరేలా ఉపాధి హామీ కింద డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటలు పెంపకానికి రైతులకు చేయూత ఇస్తోంది. మొక్కలు ఉచితంగా ఇవ్వడంతో ప్లాంటేషన్, నీటి సరఫరా మూడేళ్లపాటూ మొక్కలు పెంచే ఖర్చు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. ఐదేళ్ల పాటూ మొక్కలను కాపాడుకుంటే నిత్యం ఆదాయం చేకూరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకొస్తున్నారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం ఐదు ఎకరాలు లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు జాబ్ కార్డు కలిగి ఉండాలి.

ముమ్మరంగా ప్లాంటేషన్

మండలవ్యాప్తంగా 233 ఎకరాల్లో ముక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వర్షాకాలం ప్రారంభం కావడంతో ముమ్మరంగా ప్లాంటేషన్ చేస్తున్నారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యం మేరకు మండలంలో ఇప్పటి వరకూ సుమారు 107 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం పూర్తయిందని అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడుతున్నాయి. రైతులు జామ, మామిడి, సీతాఫలం తదితర పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పండ్లతోటల్లో అంతర పంటలు సాగు చేయడం ద్వారా ప్రధానం పంట దిగుబడి వచ్చే వరకూ అదనపు ఆదాయం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



యర్రగుంటపల్లిలో మామిడి మొక్కల్లో అంతర పంటగా సాగు చేసిన వేరుశనగ

రైతులకు మంచి అవకాశం



ఉపాధి హామీ ద్వారా నేను 3.40 ఎకరాల్లో సుమారు 210 మామిడి మొక్కలను నాటుకున్నాను. అవి ఐదేళ్ల తర్వాత దిగుబడినిస్తాయి. అయితే మూడేళ్లపాటూ మొక్కల నిర్వహణ ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తున్నందున రైతుపై భారం ఉండదు. పండ్ల తోటల మధ్య అంతర పంటలగా వేరుశనగ సాగు చేశాను. లాభసాటిగా ఉందనే మామిడి మొక్కలు నాటాను.

– పి.గంగాధర, యర్రగుంటపల్లి, నల్లచెరువు మండలం

పండ్లతోటలతో స్థిర ఆదాయం



పండ్లతోటలు పెంపకం ద్వారా రైతులకు స్థిర ఆదాయం లభిస్తుంది. ప్రభుత్వం అందజేస్తున సబ్సిడీతో చిన్న, సన్నకారు రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉంది. మండలంలో ఇప్పటి వరకూ 40 మంది రైతులతో సుమారు 107 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటించాం. త్వరలోనే వంద శాతం లక్ష్యం సాధించేలా ముందుకు సాగుతున్నాం.

–మంజుల, ఏపీఓ నల్లచెరువు మండలం

ముప్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి

ధర్మవరం అర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. జీఓ 117ను రద్దు చేసి మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. 2016 నుంచి ఇప్పటి వరకు మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించలేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్ పూర్తిగా అసంబద్ధంగా ఉందన్నారు. ఎస్‌జీటీలకు ఇష్టమైన పాఠశాలను ఎన్నుకునే అవకాశం లేదని, వారితో ఉన్నత పాఠశాలలో విద్యాబోధన చేయించడం వల్ల నాణ్యమైన విద్య ఎలా అందుతుందని విమర్శించారు. మున్సిపాలిటీల్లో అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడు, సబ్జెక్టు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, మున్సిపాలిటీకి అర్బన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులు మంజూరు చేసి వాటిని మున్సిపల్ ప్రధానోపాధ్యాయులచే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 84ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షుడు నాగప్ప, ప్రధాన కార్యదర్శి జగదీష్, ఉపాధ్యాయులు వెంకట్రాముడు, ఖాజామోహిబ్, శ్రీనివాస్‌రెడ్డి, బషీర్ అహ్మద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం



తనకల్లు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

సాక్షి బృందం: ఉపాధి హామీ కింద విరివిగా పనులు చేపట్టడం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన ఉపాధి పనుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి హామీ కింద పనులు కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం కల్పించాలని సీపీఎం నాయకులు అధికారులకు వినతపత్రాలు సమర్పించారు. నల్లచెరువు మండలం పంతులచెరువులో పంచాయతీ గ్రామసభకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామసభకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కొత్తచెరువు, బుక్కపట్నం గ్రామ సభలకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హాజరయ్యారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని వారు కూలీలకు సూచించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా దృక్పథం అలవర్చుకోవాలి



మానవతా విలువల పుస్తకాలు పొందిన విద్యార్థులతో సంస్థ సభ్యులు

బత్తలపల్లి: విద్యార్థులు చిన్ననాటి నుంచే మానవతా దృక్పథం అలవర్చుకోవాలని మానవతా స్వచ్ఛంద సేవా సమితి(శాంతి జీవనం) అనంతపురం జిల్లా అధ్యక్షుడు శీలా జయరామప్ప, డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ సభ్యులు మానవతా విలువల గురించి వివరించారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున 68 మంది పదవ తరగతి విద్యార్థులకు మావనతా విలువలకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేశారు. సంస్థ అడ్వయిజరీ కమిటీ సభ్యులు అనంతయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘టంగుటూరి’ని స్ఫూర్తిగా తీసుకోవాలి



బత్తలపల్లిలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బత్తలపల్లి: యువత ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులును స్ఫూర్తిగా తీసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి సూచించారు. గురువారం పాఠశాలలో టంగటూరు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ టంగుటూరి దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు.

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, రమణలు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ప్రిన్సిపాల్ ప్రశాంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్‌గా మారిన ఎమ్మెల్యే



తరగతి గదిలో బోర్డుపై డయాగ్రామ్ వేస్తున్న ఎమ్మెల్యే సింధూర.

పుట్టపర్తి: ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి టీచర్‌గా మారారు. పాఠశాలలో బొమ్మలు వేసి మరీ పాఠాలు బోధించారు. శుక్రవారం ఆమె బుక్కపట్నం కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజన అందిస్తున్నారా, వసతులు బాగున్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం తరగతి గదులకు వెళ్లి ఎమ్మెల్యే బోర్డుపై గణితం, సైన్సుకు సంబంధించిన బొమ్మలు వేసి మరీ పాఠాలు బోధించారు. ప్రధాన రహదారి నుంచి పాఠశాలకు సీసీరోడ్డు నిర్మించాలని ప్రిన్సిపాల్ సౌజన్య ఎమ్మెల్యేను కోరారు.అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



వక్తృత్వ పోటీలో మాట్లాడుతన్న విద్యార్థిని

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతేడాది చంద్రయాన్‌ను శాస్త్రవేత్తలు దిగ్విజయంగా నిర్వహించారన్నారు. ఈసందర్భాన్ని పురస్కరించుకుని తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డైట్ వ్యాయామ అధ్యాపకుడు రామకృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మధు

ధర్మవరం: సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ కోరారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో చేసిన అప్పులు తీర్చలేక చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. ధర్మవరంలో చేనేత పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోవడానికి పవర్‌లూమ్స్ వ్యవస్థే కారణమన్నారు. చేనేత చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకునే వారు కరువయ్యారని విమర్శించారు. పరిశ్రమను రక్షించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలి

ధర్మవరం: కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన 10 శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలు పరచాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి బుర్రా జయవర్ధన్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లో తమ కోటా వాటా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2018లో కేంద్రం రాజ్యాంగ సవరణ ద్వారా ఇతర వర్గాలకు ఎటువంటి నష్టం లేకుండా పది శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పక్కాగా అమలు చేస్తుంటే ఏపీలో మాత్రం విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని విద్య, ఉద్యోగ అంశాల్లో అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు అమలు చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలో శనివారం పలు వార్డుల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ లక్ష్మీనరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రామ్‌నగర్, కొత్తపేట, గాంధీనగర్, మారుతీనగర్, సత్యసాయినగర్, టీచర్స్‌కాలనీ, రేగాటిపల్లిరోడ్డు, శాంతినగర్, శారదానగర్, గుట్టకిందపల్లి, గూడ్స్‌షెడ్‌కొట్టాల, చంద్రబాబునగర్, నేసేపేట, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, సిద్దయ్యగుట్ట, ప్రియాంకనగర్, సాయినగర్, కళాజ్యోతి సర్కిల్, అంజుమన్ సర్కిల్, ఎస్ఎల్‌వీ మార్కెట్, పీఆర్‌టీ సర్కిల్, ఎస్‌బీఐ కాలనీ, నెహ్రూనగర్, యాదవవీధి, కోట తేరుబజార్, బడేసాబ్‌వీధి, మార్కెట్‌వీది, చెన్నకేశవస్వామి టెంపుల్, బోయవీధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాటు సారా ఊట ధ్వంసం

కదిరి అర్బన్: మరువతండా సమీపంలో నాటుసారా తయారీ స్థావరంపై శుక్రవారం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 500 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేశారు.

వృద్ధుడిపై వ్యక్తి దాడి



చికిత్స పొందుతున్న వెంకటేష్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం వృద్ధుడిపై ఓ వ్యక్తి దాడి చేశాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. మారుతీనగర్‌కు చెందిన వృద్ధుడు వెంకటేష్ నడుచుకుంటూ సిద్దయ్యగుట్టలోని సాయిబాబా ఆలయానికి బయలుదేరాడు. దుర్గానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆదినారాయణ అనే వ్యక్తి వృద్ధుడిని ఆపి డబ్బు ఇవ్వాలని అడిగాడు. వృద్ధుడు డబ్బు ఇవ్వకపోవడంతో రాయితో వృద్ధుడి తలపై దాడి చేసి తోసేశాడు. ఈ దాడిలో వృద్ధుడి తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కదిరి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని డీఎస్పీ శ్రీలత కోరారు. శుక్రవారం పట్టణంలో కోనేరు వద్ద ఉన్న ఎస్‌వీకే ఫంక్షన్ హాల్‌లో పట్టణంలోని షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పెట్టడం వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. మార్కింగ్ చేసిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు ఉంచాలన్నారు. షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా చోరీలను నియంత్రించవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, సీఐ డీవీ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి

ధర్మవరం అర్బన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ గురుప్రసాద్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల దుష్ప్రభావంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యలో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ శ్రీధర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



రేష్మా

కనగానపల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో (కేజీబీవీ) చదివిన రేష్మా ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల ఎస్ఓ నరసమ్మ తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని బద్దలాపురం గ్రామానికి చెందిన అక్కులప్ప కూతురు రేష్మా పదో తరగతి పరీక్షల్లో 522 మార్కులు సాధించిందన్నారు. ట్రిపుల్ ఐటీ కళాశాలలకు దరఖాస్తు చేసుకోగా నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థిని రేష్మను ప్రత్యేకంగా అభినందించారు.

‘సత్యసాయి’ తాగునీటి సరఫరా కార్మికుల సమ్మె

బత్తలపల్లి: తమకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక వాటర్ ట్యాంకు వద్ద సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వని కారణంగా కార్మికులు సమ్మె చేస్తున్నామన్నారు. ఐఎఫ్‌టీయు జగన్, మారుతి, బాషా, మహబూబ్‌బాషా, కేశవ, సద్గురు, రాము, సిద్దయ్య, అనంతయ్య, జయరాం తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: తమ సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మిక సంఘం నేత ఎం.సతీష్ ప్రభుత్వాన్ని కోరారు. మద్దులచెరువు సత్యసాయి తాగునీటి సరఫరా సంపు వద్ద శుక్రవారం రెండో రోజు నిరసన తెలియజేశారు. ఈపీఎఫ్, గ్రాట్యుటీ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు కె.పెద్ద ఓబిలేసు, తిరుపాలు, చిన్న ఓబిలేసు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



ఇసుక ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్ వద్ద ఉంచిన దృశ్యం

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది, ఇతర ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం తాడిమర్రి మండలం చిన్నచిగుళ్లరేవు వద్ద చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



ఆంజనేయస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: కుణుతూరు గ్రామంలో శుక్రవారం రాత్రి ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దల సమక్షంలో ఆంజనేయస్వామి చిత్రపటానికి పూలమాల వేసి గ్రామంలో ఊరేగించారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నామని గ్రామపెద్దలు తెలిపారు.

వరమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



రాజేంద్రప్రసాద్ వీధిలో పూజలందుకున్న వరలక్ష్మి అమ్మవారు

కదిరి టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలో వరమాలక్ష్మికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ వీధి, అడపాలవీధి, నల్లగుట్ట వీధి తదితర ప్రాంతాల్లో భక్తులు తమ ఇళ్లలో వరమాలక్ష్మిని కొలువుదీర్చి విశేష పూజలు చేపట్టారు. ముత్తయిదువులను ఆహ్వానించి పసుపు, కుంకుమ, సారె అందజేశారు. ఇదిలా ఉండగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి, వాసవీమాత ఆలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కృష్ణాష్టమి వేడుకలు జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: కృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 26న సాంస్కృతిక మండలిలో నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకలు జయప్రదం చేయాలని వివేకానంద యోగా కేంద్రం కోఆర్డినేటర్ నరసింహులు కోరారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వివేకానంద యోగా కేంద్రం సభ్యులు కరపత్రాలు విడుదల చేశారు. వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నరసింహులు తెలిపారు.

కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో కొల్లాపురమ్మ విగ్రహం

కనగానపల్లి: మండలంలోని భానుకోట గ్రామంలో కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కొల్లాపురమ్మ శక్తి దేవాలయంలో వేద పండితుల చేత ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేశారు. అనంతరం అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.